## క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి..

### బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్


బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఏప్రిల్ 8 : గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. సోమవారం పట్‌పడితండాలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చదువుతోపాటు ఆటలకు సమయం కేటాయించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ జహీర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, మాజీ ఎంపీపీ రాంచందర్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు సురేందర్, చంపత్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి రామన్నను కలిసిన మాజీ ఎమ్మెల్యే


మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

ఎదులాపురం, ఏప్రిల్ 8 : నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భరత్ సోమవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ను మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకుముందు వారికి స్థానిక నేతలు సాదర స్వాగతం పలికారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును కలిసి అభినందనలు తెలిపారు. అలాగే రానున్న పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధత, ఇతరత్రా అంశాలపై చర్చించారు. వారి వెంట పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, నాయకులు నర్సాగౌడ్ ఉన్నారు.




### సుఖ సంతోషాల సమ్మేళనం

# ఉగాది పర్వదినం

**● నేడు తెలుగు పండుగ ● 'క్రోధి'నామ కొత్త సంవత్సరానికి స్వాగతం**

భైంసా, ఏప్రిల్ 8 : ప్రకృతిలో మార్పు కారణంగా వచ్చే తొలి పండుగ ఉగాది. ఇది వసంత రుతువుతో ప్రారంభమవుతుంది. చెట్లన్నీ కొత్త పూత, కాతతో శోభిస్తుంటాయి. యేటా చైత్ర శుద్ధ పాడ్యమి రోజున తెలుగువారంతా ఈ పండుగను గొప్పగా జరుపుకుంటారు. ఉదయం తలంటు స్నానం చేసి, గడపకు కుంకుమ, పసుపు, గుమ్మానికి మామిడి తోరణాలు కట్టి, పూజా మందిరాన్ని రంగవల్లికలతో అలంకరించుకుంటారు. కొత్త బట్టలు ధరించి ఇంటిల్లిపాదీ ఆలయాలకు వెళ్తుంటారు. ముఖ్యంగా షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసిన ఉగాది పచ్చడిని దేవునికి నివేదించి ఇంటిల్లిపాదీ సేవిస్తారు. సాయంత్రం పలుచోట్ల, ముఖ్యంగా దేవాలయాల్లో పంచాంగ శ్రవణం చదవడం ఆనవాయితీగా వస్తున్నది. ఆయా రాశుల్లో పుట్టిన వారి యోగాక్షేమాల గురించి పూజారులు వివరిస్తుంటారు. ముందుగా వచ్చే ఖగోళ శాస్త్ర మార్పులను గ్రహించి జీవన మార్గాన్ని సులభతరం, సుఖతరం చేసుకునేందుకు ఈ పంచాంగ శ్రవణం ఉపయోగపడుతుంది. ఈ యేడాది 'క్రోధి' నామ సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలంతా సిద్ధమయ్యారు.

**సుఖ సంతోషాలు, షడ్రుచుల సమ్మేళనం.. ఉగాది పచ్చడి సేవనం..**

షడ్రుచుల సమ్మేళనంతో తయారుచేసే శ్రేష్టమైన పదార్థమే ఉగాది పచ్చడి. తీపి, చేదు, పులుపు, ఉప్పు, ఘాటు, వగరు వంటి షడ్రుచులతో ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. ఆధ్యాత్మిక పరంగా ఈ పచ్చడికి ఎంత ప్రాముఖ్యత ఉందో.. ఆరోగ్యం పరంగాను అంతే ఉన్నత స్థానాన్ని కలిగి ఉన్నది. జీవితంలోని కష్ట సుఖాలు, ఒడిదుడుకులను సమానంగా స్వీకరించి జీవితాన్ని సాగించాలని ఇది ఉద్బోదిస్తుంది. వేప, బెల్లం, చింతపండు మిశ్రమం ఆరోగ్యదాయకం.. వ్యాధి కారక క్రిములను, జ్వరాన్ని, ఉదర రోగాలను, కడుపులోని మంటను, అజీర్తిని నశింపజేస్తుంది. వేప పూవు పచ్చడి తినడం ఈ పండుగ విశిష్టత. కొత్త సహస్రాబ్ధికి ప్రారంభ సూచకంగా భావించే ఈ రోజు నుంచి సంవత్సరం పొడవునా ఎదురయ్యే మంచీ చెడులను సమానంగా స్వీకరించాలన్న సందేశమే ఉగాది పచ్చడిలోని ఆంతర్యం. పుణ్యక్షేత్రాలు దర్శించుకోవడం వల్ల ఏడాదంతా శుభాలు కలుగుతాయని నమ్మకం. కాగా, పంచాంగ శ్రవణానికి పలుచోట్ల ఆలయాలు ముస్తాబు చేశారు. సోమవారం మంచిర్యాల మార్కెట్‌లో సందడి నెలకొంది. మామిడికాయలు, పూలు, కొత్త కుండలు, బెల్లం, చింతపండు, శనగపువ్వంటివి కొనుగోలు చేశారు.

# కొంటరా..? కొనరా..?

**● కాంగ్రెస్ సర్కారుకు రైతుల అల్టిమేటం ● జొన్న కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ఆగ్రహం**
**● మార్క్‌ఫెడ్ అధికారులు ప్రతిపాదనలు పంపినా స్పందన లేదు.. ● పంట చేతికొస్తున్న క్రమంలో ఆందోళన చెందుతున్న కర్షకులు**


సాగు చేసిన జొన్న పంట

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 8 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా కుంటాల, సారంగాపూర్, దిలావర్‌పూర్, లోకేశ్వరం, ముథోల్, కుభీర్, తానూర్, మామడ, సోన్, నర్సాపూర్(జి) మండలాల్లో జొన్న సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో సాగైనట్లు.. 1.50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భూగర్భజలాలు, కరెంట్ కోతలు ఉంటాయని భావించిన రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపారు. దీంతో రైతులు జొన్న పంట వేశారు. జొన్న ఆహార పంట కావడం, మార్కెట్‌లో డిమాండ్ ఉండడం, తక్కువ నీరు అవసరం కావడం, పెట్టుబడి తక్కువగా అవుతుండడం, పంట కాల పరిమితి 105 రోజులే కావడంతో రైతులు ప్రాధాన్యత ఇచ్చారు. డిసెంబర్‌లో పంట వేయగా ఏప్రిల్‌లో ఉత్పత్తులు చేతికొస్తున్నాయి.

**కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వని సర్కార్**

జొన్న పంట చేతికొస్తున్న క్రమంలో కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కారు స్పష్టత ఇవ్వక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరం జొన్న సాగు చేస్తే పది క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. జిల్లాలో నిర్మల్, సారంగాపూర్, ఖానాపూర్, భైంసా, కుభీర్ మార్కెల్ కమిటీలు ఉండగా.. ఒక్క భైంసాలో మాత్రమే కొనుగోళ్లు నిర్వహిస్తున్నట్లు రైతులు తెలిపారు. అక్కడ కొనుగోళ్లు ఓపెన్ యాక్షన్ ద్వారా నిర్వహిస్తున్న వ్యాపారులు సిండికేట్‌గా మారి, వారు నిర్ణయించిన ధరకు మాత్రమే కొంటున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలుకు రూ.3 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. అదే మార్క్‌ఫెడ్ ప్రకటించిన గ్రేడ్-ఏకు రూ.3,285, గ్రేడ్-బీ ద్వారా రూ.3,265 మద్దతు ధర లభించేదని రైతులు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పంట ఉత్పత్తులు ఉంచుకోవాలో.. అమ్ముకోవాలో అర్థం కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు మాత్రం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొంటున్నారు. వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై మార్క్‌ఫెడ్ అధికారులను సంప్రదించగా.. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

## నీటి సమస్య పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 8 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఏజెన్సీ గ్రామాలను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మండలాధికారులతో కలిసి సోమవారం సందర్శించారు. వాన్వాట్, పిప్పల్‌ధరి, ఖండాల గ్రామాల్లో పర్యటించారు. నీటి సమస్య గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా మంచి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్‌వాడీ సమస్యను పరిష్కరించాలని విన్నవించగా సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

**నాణ్యమైన విద్యను అందించాలి..**

ఉట్నూర్, మార్చి 8 : గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం ఆదిలాబాద్ మండలంలోని పాఠగూడ సాటిలైట్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని సూచించారు. అలాగే మంచినీటి సమస్యలో భాగంగా కొలాంగూడ, పిప్పల్‌ధరి గ్రామాలను సందర్శించారు.

## నామినేషన్ ప్రక్రియపై సమావేశం

ఎదులాపురం, ఏప్రిల్ 8 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ ప్రక్రియపై సహాయ రిటర్నింగ్ అధికారి బోథ్ ఖుష్బూ గుప్తా, తహసీల్దార్లకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని జిల్లా రిటర్నింగ్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం తమ చాంబర్‌లో నామినేషన్ ప్రక్రియపై ఏఆర్వో, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 18వ తేదీ నుంచి లోక్‌సభ ఎన్నికల నామినేషన్‌ల స్వీకరణకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 28న వెలువడిన గైడ్‌లైన్స్ పాటించాలని, అభ్యర్థులు ఏప్రిల్ 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయాలని, అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో ఎలాంటి బ్లాంక్‌లు లేకుండా చూసుకోవాలని, చెక్‌లిస్ట్ ప్రకారం నామినేషన్ ఫారం అభ్యర్థులు సమర్పించేలా చూడాలన్నారు. నామినేషన్ స్క్రూట్నీ రిటర్నింగ్ అధికారి మాత్రమే చేయాల్సి ఉంటుందన్నారు. 26వ తేదీన నామినేషన్‌లను పరిశీలన, 29వ తేదీన వరకు ఉపసంహరణ, మే 13న పోలింగ్, కౌంటింగ్ జూన్ 4న ఉంటుందన్నారు. ఈనెల 15వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలక్టోరల్‌కు సంబంధించి ఆపరేటర్, సిస్టమ్స్ ఏర్పాటు చేయాలన్నారు.


మాట్లాడుతున్న జిల్లా రిటర్నింగ్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా


నిర్మల్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి..

### కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 8 : పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘ నాయకులు విలాస్, భూక్య రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్మల్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తు ధర్నా చేశారు. విద్యా సంవత్సరం ముగుస్తున్నా బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కోడిగుడ్ల బిల్లులతోపాటు గౌరవ వేతనం విడుదల చేయలని కోరారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మోసవ్వ, సాయవ్వ, లక్ష్మి, సావిత్రి, రూప, లలిత, భాగ్య, రాధ, పోసాని, హంస, విమత ఉన్నారు.



దేవునిగూడెం సమయం దాటిన ఇంకా తెర్చుకోని ప్రభుత్వ పాఠశాల

*చిత్రంలో కనిపిస్తున్న బడి.. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని దేవునిగూడెంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. ఇందులో ఐదో తరగతి వరకు ఉండగా.. దాదాపు 20 మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. స్కూల్‌ను సోమవారం ఉదయం 7.45 గంటల వరకు తెరవాల్సి ఉండగా.. 8.23 గంటల వరకు కూడా తెరుచుకోలేదు. 8.30 గంటలకు ఉపాధ్యాయుడు పోశెట్టి వచ్చాడు. ఈ విషయమై కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగాధర్‌ను వివరణ కోరగా.. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై మా దృష్టికి రాలేదని, పాఠశాలను తనిఖీ చేపట్టి సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.* **- దస్తురాబాద్, ఏప్రిల్ 8**

## నగదు పట్టివేత

ఇచ్చోడ, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ రోడ్డుపై సోమవారం వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా రూ.2.03 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేశవపట్నంకు చెందిన షేక్ యాసిన్, మాధవ్ గుడిహత్నూర్‌కు వెళ్తున్న క్రమంలో సీఐ భీమేశ్ వారిని తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేని తరలిస్తుండడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా.. సిరిచెల్మ గ్రామానికి శ్రీనివాస్ గౌడ్ వద్ద రూ.10,500 మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.


కూలీలతో కలిసి పని చేస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

## ఉపాధి హామీ పనుల పరిశీలన

కడెం, ఏప్రిల్ 8 : ఉపాధి హామీ పనులను సోమవారం డీఆర్డీవో విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్ద బెల్లాల్, కన్నాపూర్, పెద్దూర్ పంచాయతీలను ఆమె సందర్శించారు. అయితే కూలీలు ఎండలను దృష్టిలో ఉంచుకుని వేకువజామునే పనులకు చేరుకోవాలని, అలాగే కూలీలకు పంచాయతీ కార్యదర్శులు టెంట్లు, మంచినీటి సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే రానున్న వర్షకాలం దృష్ట్యా కాలువల మరమ్మతుల పనులను కూలీల ద్వారా పూర్తి చేయించేలా చూడాలని, అలాగే రైతులకు అవసరమైన పనులను సైతం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ప్రతి కూలీకి వంద పనిదినాలను కల్పించాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఏపీవో జయదేవ్, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, భూమేశ్, మునురుల్ హాసన్ ఉన్నారు.


ముస్లింలకు ఖర్జూరా తినిపిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

బోథ్, ఏప్రిల్ 8 : కౌట(బీ) గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. స్థానిక మజీద్ కమిటీ ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లింలు రంజాన్ పండుగను పవిత్రంగా జరుపుకుంటారన్నారు. అందరు కలిసిమెలిసి ఉండి అభివృద్ధి కోసం సహకారం అందించాలన్నారు. అనంతరం కుమ్మరి సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో ఎస్పీ గౌష్ ఆలం

## భక్తిశ్రద్ధలతో ఇఫ్తార్ ప్రార్థనలు

ఎదులాపురం, ఏప్రిల్ 8 : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ముస్లిం పోలీస్ అధికారులు, సిబ్బందికి రంజాన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ గౌష్ ఆలం పాల్గొన్నారు. రంజాన్ పవిత్ర దినాల్లో ఇఫ్తార్ విందును యేటా పోలీసులు నిర్వహించుకుని మతసామరస్యానికి చాటుతున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ స్వప్నిల్ పవర్, సీఐలు సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, ఫణిధర్, ప్రణయ్‌కుమార్, రిజర్వ్ సీఐ నవీన్‌కుమార్, మురళి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.







